

# పునరావృతం

## గుంటూరు రమాదేవి

**ప్రోసుమవ్ ఉత్తరం అందిస్తూ ఉండగానే అర్థం కాని దిగులేదో పేరుకుపోయింది జానకి మనసులో.**

విప్పి చదివిన తర్వాత ఓ విధమైన అయోమయ స్థితిలో పడిపోయింది. సరిగా అవగాహన చేసుకోడాని కన్నట్టు ఇంకోసారి చదివింది. అవే అక్షరాలు. అవే భావాలను వెల్లడి చేస్తున్నాయి. ఉత్తరం కొడుకు వాసు పేర ఉంది కాకినాడలో ఉన్న మరిది రాశాడు.

''వాసూ! నిన్ను కలెక్టర్‌గా ప్రమోట్ చేశారని విన్నాను చాలా సంతోషం కళ్ళముందు పెరిగిన వాడివి ఇంత వృద్ధిలోకి వచ్చావంటే నాకంటే ఆనందించేవారెవరుంటారు! అసలు విషయం. మన శేషు జిల్లా పరిషత్‌లో ఉద్యోగానికి అప్లికేషన్ పెట్టాడు. నీకు రాయడం ఎందుకైనా మంచిదని పించింది నీ తమ్ముడి సంగతి నువ్వు పట్టించు కోకుండా ఉంటావని అపనమ్మకం లేదనుకో. నువ్వూ వదినా ఒకసారి ఈ వూరు తప్పక రండి మీ అమ్మకి నా నమస్కారాలు చెప్పు. వీలుంటే నిన్ను స్వయంగా కలవడానికి ప్రయత్నిస్తాను. బహుశ అంత అవసరం రానివ్వవులే నువ్వు. ఉంటా మరి — సుందరం''

ఎలాగో అక్షరాలన్నీ కూడబలుక్కుని చదివింది. ఇదంతా సుందరం రాశాడంటే నమ్మలేనంత ఆశ్చర్యంగా ఉంది. కాదూ! ఆలోచనలు గతంలోకి పరుగుతియ్యబోతూ ఉంటే కళ్ళెం పట్టుకుని ఆపుచేసింది.

''భోజనానికి లేవండత్తయ్యా. టైము పన్నెండు దాటింది.'' కోడలి గొంతులో వ్యక్తమయ్యే ఆ అధికారానికీ, వాత్సల్యానికీ ఎప్పుడూ తత్తర పడుతూనే ఉంటుంది జానకి

చటుక్కున ఉత్తరం మడిచిపెడుతూ ''వస్తున్నాను పదమ్మా'' అని లోపలికి నడిచింది

అన్నం తింటున్నంతసేపూ పరధ్యానంగానే ఉంది. గదిలో తెల్లని పక్క, టీపాయ్‌మీద వక్కపొడి భరిణె అప్పటికే అమర్చింది కోడలు దక్షిణం వైపున బార్లా తెరిచి ఉన్న తలుపుల్ని దాటుకుని చల్లటిగాలి లోపలికి విసిరికొడుతున్నా ఆ వేళ మామూలుగా నిద్రపట్టలేదు. ఎలా పడుతుంది, ఆ జ్ఞాపకాలే కళ్ళలో కదులుతుంటే.

ఓ క్షణం మంగళసూత్రం లేక బోసిగా ఉన్న మెడ తడుముకుంది. కళ్ళలో నీళ్ళు చిమ్మాయి.

కొన్నేళ్ళ క్రితం ఆ ఇంట్లో కాపురానికి అడుగుపెడుతూ ఆ ఇల్లు తన ఇల్లే ఆ మనుషులు తనవాళ్ళే అనే భావన ఏర్పరచుకుంది పదిహేనేళ్ళ వయసులో జానకి. ఆడదక్షతలేని కొరత ఆ ఇంట్లో కొట్టొచ్చినట్టు కనిపించింది. నాలుగేళ్ళ మరిది సుందరం 'వదినా' అంటూ తన కొంగుపట్టుకునే తిరిగేవాడు. ఆ పసివాడి బాధ్యత సంతోషంగా స్వీకరించింది వేళకి అన్నీ అమరుస్తూ శ్రద్ధగా బడికి పంపుతూ సుందరాన్ని పెంచడంలో ఎంతో మానసికానందం పొందేది.

నిజానికి శివరావుకు ఉన్నది అయిదెకరాల మెట్ట వర్షాధార పొలాలు కావడంతో ఒక్కోసారి పంట ఆశించినంతగా చేతికి వచ్చేదికాదు అయినా ఎప్పుడూ అధైర్యపడలేదు అతడు భూదేవి అండ అతనికి కొండంత విశ్వాసాన్ని ఇచ్చేది. సుందరం స్కూల్ ఫైనల్ పరీక్షలో జిల్లాలోనే మొదటివాడుగా ఉత్తీర్ణుడైనప్పుడు సంతోషంతో ఉప్పొంగిపోయాడు ఎరువులు కొనడానికి బ్యాంకులో తీసుకున్న డబ్బును సుందరం కాలేజీ ఫీజులకు కేటాయించదలచు కున్నాడు. జానకి కూడా ఆ మాటను బలపర్చింది

కానీ సుందరం ముఖంలో ఉత్సాహం లేదు.

''పెద్దన్నయ్యా! ఇంతవరకు చదివించిచాలు ఎక్కడైనా చిన్న ఉద్యోగం చూసుకుని నీకు సాయపడాలని ఉంది'' అనేశాడు.

శివరావు ముందు నిర్ఘాంతపడినా నవ్వాడు.

''నిండా పదహారేళ్ళయినా లేవు నీకు. ఏం ఉద్యోగం చేయగలవురా అబ్బీ! నేను బ్రతికి ఉండగా అప్పుడే నీకు ఒకరి చేతికింద నౌకరీ కుదుర్చుకునే ఖర్మేముంది. చక్కగా చదువుకో'' అని ప్రోత్సహించాడు.

''అవునయ్యా! ఇప్పుడు నువ్వు సంపాదించి పోస్తేనేగాని రోజు గడవదా. బాగా చదువుకుని పెద్ద ఉద్యోగస్థుడివైతే మేమిద్దరం సంతోషిస్తాం'' అంది జానకి

అయిష్టంగానే పొరుగూరు వెళ్ళి కాలేజీలో చేరాడు సుందరం. అప్పటికి శివరావుకి ఇద్దరు పిల్లలు.

సుందరం ఒక్కొక్క మెట్టే ఎక్కి పైకి వెడుతున్న కొద్దీ కళ్ళలో వత్తులు వేసుకుని చూశారు శివరావు దంపతులు. పి. యు. సి. లో మంచి మార్కులు రావడంతో సుందరానికే చదువు మీద ఉత్సాహం పెరిగింది. భవిష్యత్తుమీద ఆశలు కలిగేయి. సెలవులకి ఇంటికి వచ్చినప్పుడు తటపటాయిస్తూనే తన కోరిక అన్న చెవిన వేశాడు

''ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదవాలని ఉందన్నయ్యా.''

శివరావుకు ఏమనాలో తోచలేదు తల్లీ తండ్రీ కూడా చిన్ననాడే గతించడంతో తమ్ముడి బాధ్యత నెత్తిన వేసుకుని ఇంతవాణ్ణి చేశాడు. ఏదో డిగ్రీ వరకు చదివించి ఉద్యోగంలో చేర్పవచ్చునని అనుకున్నాడు. ఇంజనీరింగ్ చదువంటే మాటలా! తన శక్తికి మించిన పని. అలా అని తమ్ముడి ఉత్సాహాన్ని భగ్నం చేయలేకపోయాడు.

ఆ సమస్యను జానకి పరిష్కరించింది

''పిల్లాడు నిక్షేపంలా చదువుకుంటానంటే మాట్లాడరేమండీ. ఏదో చెడుమాట విన్నట్టుగా అలా ఉలిక్కిపడతారేం! ముచ్చటపడి చదువుకుంటా నన్నడంకూడా నేరమేనా! డబ్బుకోసమే మీరు ఆలోచిస్తున్నది నిజమే అయితే మరేం ఫరవాలేదు. నా నగలున్నాయి. ఎంత లేదన్నా పదివేలు విలువ చేస్తాయి'' అంది.

ఆ క్షణంలో వంగి వదిన పాదధూళి తీసుకుందా మన్నంత ఆవేశం కలిగింది సుందరానికి కానీ వీలుపడక కళ్ళతోనే కృతజ్ఞతలు తెలియజేశాడు

## ఓహో! స్టూడెంటూ!

కళాశాలకొచ్చి కలలుగనే విద్యార్థీ!
కరువు కాలంలో నీ కెందుకోయీ ఖర్చు
నీవు ధరించే కట్టుబట్ట గిట్ట నీవి కావోయి
నీకోసం చెమటోడ్చే నీ తండ్రివోయి
'టక్కు' చేసి, 'బెల్టు' కట్టి, 'బూటు' వేసి
'రిస్టువాచి' పెట్టి టుక్కు టిక్కుమనే చిన్నోడా!
తలకు నూనేదిరా బుల్లోడా?
ఓహో! 'స్టెప్పు కటింగు' చేయించావా?
'హీటరు'తో నొక్కించావా?
అయిదు రూపాయలు క్షవరమా?
నీ కెందుకురా ఈ అవస్థ.
నీకా 'షోకు' లేకపోతే నాకీ 'షాకే' లేదు.
నీకా 'షోకు' లేకపోతే
ఆడపిల్ల చూడదనే నీ కలవరమా?
ఏల ఆటలన్ని వేటలన్ని ఆపివేసి
నేటికైన విద్యవేట ఆరంభించర స్టూడెంటూ.

— నాగేందర్ బత్తుల

శివరావు ఆర్థిక ఇబ్బందులవరకే ఆలోచించాడు

"నీ చదువుకి ఈ కాస్త పొలం బేరం పెడతాను ఆపైన నీకు స్కాలర్‌షిప్ వస్తుంది బాగానే ఉంది. కానీ రేపు నా కొడుకు వాసు ఎలా చదువుకుంటాడు? కూతురు శ్యామల పెళ్లి ఎలా అవుతుంది?" ఈ సందేహాలను శివరావు వెలిబుచ్చలేదు

సుందరం మాత్రం చాలాదూరం ఆలోచించాడు

"పిల్లల సంగతి నామీద విశ్రాంతిగా వదిలేయి అన్నయ్యా! నేను చూసుకుంటాను."

సుందరం ఇంజనీరింగ్ చదువులో ప్రవేశించాక డబ్బు ఇబ్బందులు తీవ్రంగా ఎదుర్కొన్నాడు శివరావు రెండు దఫాలలో పొలం అమ్మేయవలసి వచ్చింది సుందరం ఫైనలియర్‌లోకి వచ్చేసరికి జానకి మెడలో నల్లపూసలు, పసుపు కొమ్ము మిగిలేయి ఊళ్లో తెలిసిన వాళ్లందరి దగ్గిరా అప్పులు చేశాడు శివరావు, సుందరానికి ఉద్యోగం వస్తే ఇవి తీర్చేయడం ఎంతసేపు అనే ధీమాకొద్దీ.

సుందరం చదువు అనుకున్నట్టుగానే ముగిసింది. మంచి ఉద్యోగం వచ్చింది కానీ సుందరం జీవితంలో తర్వాత జరిగిన సంఘటనలతో ఎవరికీ ప్రమేయం లేకపోయింది. అన్నగారితో సంప్రదించకుండానే ఓ పెద్ద ఆఫీసర్ కూతురితో పెళ్లి స్థిరపర్చుకున్నాడు. అక్షతలు వేసే టైముకి మాత్రం వెళ్లారు శివరావు, జానకి

"ముందుచెప్పే వ్యవధి లేకపోయిందన్నయ్యా" అని నొచ్చుకున్నాడు

శివరావు ఆ మాత్రం పెద్దరికం ఇచ్చినందుకే పొంగిపోయాడు. తమ్ముడిమీద ప్రేమాభిమానాలు రవ్వంత కూడా తగ్గలేదతనికి నెలకోసారి కులాసాగా ఉన్నట్టు సుందరం ఒక కార్డుముక్క రాస్తే చాలనుకున్నాడు జానకి కూడా మరిది నుంచి అంతకంటె ఏమీ ఆశించలేదు

# పునరావృతం

వాసును హైస్కూలు వరకు దాటించి చిన్న ఉద్యోగంలో పడేద్దామనుకున్నా శ్యామల పెళ్లి ఏదివేలైనా చేతిలో లేందే జరిగేటట్టు కనిపించ లేదు అంతవరకు తలకి నీడనిస్తున్న కొంపని అమ్మకానికి పెట్టక తప్పలేదు.

అయితే సుందరం చదువుకి చేసిన అప్పులే ఆ డబ్బుని మింగేస్తాయనుకోలేదు శివరావు. పిల్లకి కుదుర్చుకున్న మంచి సంబంధాన్ని తోసిపారెయ్యలేక సుందరం ఉంటున్న ఊరికి వెళ్లాడు

మరదలు అభిమానంగానే పలకరించింది "ఆయన ఆఫీసుకి వెళ్లారు. సాయంత్రానికి వచ్చేస్తారు." అని కాఫీ ఇచ్చింది.

ఓపిగ్గా ఎదురుచూస్తూ వీధి వరండాలోనే కూర్చున్నాడు శివరావు

ఇప్పుడు తమ్ముడు చెప్పే మాటమీదే తన కూతురి భవిష్యత్తు ఆధారపడివుంది శ్యామలకి మంచి సంబంధం కుదిరిందంటే తను మాత్రం ఎగిరి గంతెయ్యడు! ఎంత లేదన్నా సుందరం పేర బ్యాంకులో ఇరవై వేల వరకు ఉంది. ఈ బాధ్యత తీసుకోకపోతాడా.

చీకట్లు ముసురుతూ ఉండగా వచ్చాడు సుందరం. అన్నగారిని చూసి ఆశ్చర్యపడ్డాడు.

"వచ్చేముందు ఉత్తరం రాస్తే స్టేషన్‌కు వచ్చేవాడినిగా అన్నయ్యా!" అన్నాడు ప్రేమగా పలకరిస్తూ.

శివరావు కళ్ళు ఆర్ద్రం అయ్యేయి. నువ్వున్నావనే ధైర్యంతోనే వచ్చానురా సుందరం. శ్యామల పెళ్లికి నువ్వు తప్పితే ఎవరు చేయూత నివ్వగలరు. ఇలా అనేక భావాలు గుండెల్లో పెల్లుబికేయి.

"ఏం లేదురా సుందరం! చిన్న పనిమీద బయలుదేరాను. అంతే. స్నానం చేసి రా. ఆఫీసులో చాల అలసిపోయి ఉంటావు" అని లోపలికి పంపించాడు.

ఆ రాత్రి భోజనాలై తీరికగా కూర్చున్నప్పుడు కూడా ఈ సంగతి మాట్లాడలేకపోయాడు శివరావు గొంతులో ఏదో అడ్డుకున్నట్టుగా తోచింది. ఆ రోజు అంత సాయం చేసి నన్ను పైకి తీసుకొచ్చావనే అధికారంతో ఇప్పుడిలా అడుగుతున్నావా అన్నయ్యా అంటే తనేం సమాధానం చెప్పగలడు.

మర్నాడు తెల్లవారుఝామున చేతిసంచీ పట్టుకుని రైలు వేళకు బయలుదేరబోతూ ఉంటే సుందరం స్టేషన్‌వరకు వచ్చి దిగబెట్టాడు

"అన్నయ్యా! నువ్వు మనసులో ఉంచుకుని పైకి చెప్పలేకపోతున్నదేమిటో గ్రహించాను. శ్యామలకి మునసబుగారబ్బాయిని మాట్లాడుతున్నావని మన ఊరివాళ్లెవరో ఆమధ్య కనిపించి చెప్పారు. బ్యాంకులో నాకు పాతికవేలదాకా ఉన్న మాట నిజమే. మొన్న ఓ ఫ్రెండ్ బిజినెస్ పెట్టుకుంటున్నాను, అర్జెంటుగా సాయం చేయమని అడిగాడు. ఇవ్వక తప్పిందికాదు" అన్నాడు నొచ్చుకుంటూ.

శివరావు నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

"మరో సంబంధం ఏదైనా తక్కువలో కుదురుతుందేమో చూద్దాంలే అన్నయ్యా. పేటల మీద పెళ్లిళ్లే ఎన్ని ఆగిపోతున్నాయి ఈ రోజుల్లో దీనికి పెద్దగా విచారించవలసిన పనిలేదు"

"అంతేలే మరి వస్తాను"

రైలెక్కాడు. కళ్లలో సన్నటి నీటిపొర కమ్మింది ఈ పెళ్లి జరుగుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న భార్యా, కూతురూ అది అసంభవమని తెలిసి ఏమైపోతారు? సుందరం మీద అంత భరోసా తను ఏ ధైర్యంతో పెట్టుకున్నాడు? ఇందులో తప్పెవరిది! ముమ్మాటికీ తనదే. కన్నపిల్లల మంచి చెడ్డలు ఆలోచించడం మర్చిపోయాడు వాళ్ల బాధ్యత మరొకరిపై పెట్టి నిర్వ్యాపారంగా ఉండిపోయాడు ఆ హక్కు తనకెవరిచ్చారు?

తాంబూలాల వరకు వచ్చేసిన పెళ్లి ఊహించని విధంగా తప్పిపోతే కన్నె హృదయం కన్న కలలు కళ్లముందే కరిగి నీరైపోతే దెబ్బతిన్న పక్షిలా ఇంట్లో తిరుగుతున్న శ్యామలని చూస్తుంటే అతని గుండె తరుక్కుపోయింది.

కన్నకొడుకులా పెంచుకున్న సుందరం ఈ విధంగా ప్రవర్తించాడంటే నమ్మలేని స్థితిలో పడిపోయింది జానకి. లేచి తిరిగే ఓపిక నశించి రోజులో చాలా భాగం మంచంమీదే గడుపుతోంది

స్కూల్ ఫైనల్ కూడా పూర్తిచేయకుండా వాసు వర్క్‌షాపులో మెకానిక్‌గా చేరాడు

ఈ పరిస్థితులకు తట్టుకోలేక తీవ్రంగా దెబ్బతిన్నది శివరావు ఒక్కడే. తెలియని వేదన గుండెల్ని చీల్చుతుంటే ఓ రోజు నిర్విస్తంగా హార్ట్ ఎటాక్‌తో ఇహలోకం విడిచిపోయాడు

శివరావు అంత్యక్రియలకీ, మరో ఆర్నెల్లకి శ్యామలని నలభైయేళ్ల రెండో పెళ్లివాడికిచ్చి చేస్తున్నప్పుడు సుందరం అప్పుడిలా హాజరయాడు. తనవంతు పైసా కూడా ఖర్చు చేయకుండానే బోలెడు సానుభూతి కుమ్మరించి చుట్టుపక్కలవారు ఈ కుటుంబానికి ఇంతకంటె దగ్గిరవాడు ఎవరూ లేరని చెప్పుకునేటట్టు చేశాడు.

మరిక ఆ ఊళ్లో ఉండటానికి మనస్కరించక వాసు కుటుంబంతో మద్రాసు తరలివెళ్లాడు ఓ పక్క వర్క్‌షాపులో పనిచేస్తూనే నైట్ కాలేజీలో చేరి బియ్యే చదివాడు ప్రైవేటుగా ఎమ్మే కూడా పాసయ్యాడు.

అంతటితో ఆగక ఐ. ఎ. ఎస్. పరీక్ష రాశాడు సెలక్టు అయ్యాడు. సబ్ కలెక్టర్‌గా కొన్నాళ్లు పనిచేసి ప్రమోషన్‌పై స్వస్థలానికి మంచి హోదాతో తిరిగి వచ్చాడు

## సాహిత్య సేవ

ఏదైనా వ్రాయాలని అనిపించినప్పుడు
ఏదో ఒకటి గికిపారేసి

చెత్త సాహిత్యాన్ని తయారించి
చెత్తను పెంచేకంటె

నిశ్శబ్దంగా ఉండగలగటం కూడా
నిజమైన సాహిత్య సేవయే!

— వెల్లపిల్ల సౌభాగ్యకామేశ్వరి

# ✦ డాక్టర్ సలహాలు ✦

— డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

సి హెచ్. ఎస్. — మాచవరం

నాకు ఉదయం లేవగానే ముక్కులోనుండి రక్తము వస్తున్నది. పెదవుల ప్రక్కన పంటిచిగుళ్ళ వద్ద తరచు చిన్నగా పుండ్లు పడుతున్నవి. ఈ రెండింటికి ఏమైనా సంబంధము వున్నదా ? వీటిని నివారించాలంటే ఏమి చెయ్యాలి ?

★ ముక్కులో నెత్తురు కారటానికి, దంతముల చిగుళ్ళవద్ద 'పుండ్లు' ఏర్పడటానికి — అందులో తరచూ ఇలా జరగటానికి — ఈ ప్రదేశాలలోనూ యితర భాగాలలోనూ వున్న 'ఎపితీలియల్ సెల్స్' అనబడే రక్షక జీవకణాల అమరికలోను, పెరుగుదల లోను, క్రమంలోను లోటు వున్నట్లు తెలియ వస్తున్నది

ఇలా జరగటానికి విటమిన్లు 'ఎ', 'సి', 'కె' మొదలైనవి, కేల్షియం మొదలైన ధాతువులు శరీరంలో లోపించటం ముఖ్యకారణం.

కారణం తెలుసుకున్నాక, ఇప్పటికే వున్న లోపానికుగాను మాత్రల రూపంగానో ఇతరత్రానో— శరీరానికి అందజేసి తర్వాత ఆహారం—పాలు, పండ్లు, ఆకుకూరల రూపేణా రోజుకి కావలసినంతమేరకు (ఈ విటమిన్ల రోజువారీ అవసరాలు) తీసుకోవటం అవసరం. ఎందుకంటే ఎన్ని వసతులు వున్నా జీవితాంతం ఎవరూ మందులమీదే ఆధారపడి వుండటం అసంభవం కదా !

సి. వి. కె. ఆర్. — ధూళిపూడి

చిన్నపిల్లలు నిద్రలో పండ్లు కొరుకుతారు. ఎందువలన ? మా బాబుకి చెవిలో చీము కారు తోంది. దీనికి నివారణ ఏమిటి ?

★ నిద్రలో పండ్లు కొరకటానికి కారణం, కలలు రావటం, ఆ సమయంలో కోపం ప్రదర్శించే పరిస్థితి పిల్లలకి ఏర్పడటం, పగటిపూట దైనందిన జీవితంలో తీరని కోరికల ఫలితంగా ఏమీ చేయలేక వాటిని అణచిపెట్టుకోవలసి రావటంవల్ల ఎక్కువగా ఈ విధంగా పండ్లు కొరకటం (టీత్ గ్రైండింగ్) జరుగుతుంది మానసిక, శారీరక, ఆహార లోపాల వల్ల అతి గారాబం, అతిగా కట్టుబాట్లలో వుంచటం వల్ల గాని ఇలా ఏర్పడుతుంది. దీనికి నివారణ పై వాటికై తగిన శ్రద్ధాసక్తులు తలిదండ్రులు, ఇతరులు చూపించటమే.

చెవిలో చీము కారటానికి కారణం చెవిలో లోపలి భాగం అనే మధ్యచెవి (మిడిల్ ఇయర్) లో చీమును ఉత్పత్తిచేసే క్రిములు చేరటంవలననే. దీనిని ఆటైటిస్ మీడియా అంటారు. ఇలా జరగటానికి ఎక్కువగా మన ఆచార వ్యవహారాలే ముఖ్యకారణాలు

దీని నివారణ, ఆ చీముని తీసి ఆ క్రిము లేమిటో అని ఏ మందుకి తొందరగా లొంగుతాయో అవి లేబరేటరీలలో పరీక్షింపజేసుకొని, ఆ ఫలితాలను అనుసరించి తగిన మందులను (డాక్టరు సలహాపై) చెవులలోనూ, ఇతరత్రా మందులు వాడటంవల్ల తప్పక నయమవుతుంది.

సి కె. కె. — కడప

నా వయస్సు 21 సం॥లు. నాకు 4 సం॥ల నుండి పాదాలనుండి తొడలవరకు దురదగా వుంటుంది. దానివల్ల ఏర్పడ్డ మచ్చలతో కాళ్ళు చాలా అసహ్యంగా వున్నవి. ఈ మచ్చలు పోవాలంటే ఏమి చెయ్యాలి ?

★ దురదలు ఏర్పడ్డ తరువాత కొంత కాలానికి మచ్చలు ఏర్పడటం కొంతవరకూ సహజం అనే చెప్పాలి. మచ్చలు పోవటానికి మందు వ్రాయటం తప్పనీ, నాల్గు సం॥లుగా దురదలు వుండటంవల్ల ఏర్పడ్డవి కాబట్టి—ఆ దురదలకి కారణాలు రక్త పరీక్ష, మలపరీక్ష, మూత్రపరీక్షలు చేయించుకొని దానికి తగిన చికిత్స చేయించుకొన్నచో ఆ మచ్చ లనేవి ఏర్పడవుగా ?

తాత్కాలికంగా కావాలంటే— 'డెక్సామెతసోన్' 'టార్సలాన్' అనే రెండు పైపూత మందులూ రోజుకి రెండుసార్లు పూయటంవల్ల కొంతవరకూ తగ్గవచ్చును.

డి ఎస్ పి. ఆర్. — మెలుపాక

నా వయస్సు 16 సం॥లు. 2 సం॥ల నుండి నా ముఖంమీద గోధుమరంగు మచ్చలు వస్తున్నాయి అవి ఎందుకు వస్తాయి ? అవి పోవాలంటే ఏమి చెయ్యాలి ?

★ మచ్చలనేవి ఏ రంగులో వున్నా అవి ఎలా ఏర్పడతాయనేది ముఖ్యంగా పరిశీలించతగిన విషయం తెల్లగా మచ్చలేర్పడటం, నల్లని మచ్చలు మీరు వ్రాసిన గోధుమరంగు లేక జేగురు రంగు మచ్చలనేవి ఎక్కువగా శిశుప్రాయంలోనే తల్లి గర్భంలో పెరుగుతున్నప్పుడే నిర్ణయింపబడి ఏ సమయంలో నైనా బహిర్గతమయ్యే అవకాశం కలిగివుంటాయి కొన్ని మచ్చలు ఒకే ప్రదేశంలో మాత్రంలోనే ప్రత్యేక కారణాల వల్ల ఏర్పడివుంటే మాత్రం కృత్రిమంగా రాగలవని అంటారు ఉదాహరణకు జేగురు వర్ణపు లేక గోధుమ వర్ణపు మచ్చలు ముఖం మీద మొటిమలు గిల్లబడిన తర్వాత ఆ చుట్టూతా చేరే నెత్తురు గడ్డకట్టి నిలిచిపోవటం వల్ల ఏర్పడటం సహజమే. అవి పోవాలంటే ప్రత్యేకంగా తీసుకోదగిన చర్యలేమీ లేవు పైగా నలుగురూ చెప్పే నాలుగు మాటలూ విని అసలుకే మోసపోయే కన్నా ఉన్నదాన్ని అలాగే వుంచటం మంచిది

సి. యస్ ఆర్. — ఒంగోలు

సిగరెట్లు త్రాగటంవల్ల గాయకుల గళం మారుతుందా ?

★ మారే అవకాశం వున్నది. మితిమీరి ఏ పని చేసినా తినగా తినగా గారెలు చేదన్నట్లు ఎక్కువగా పొగపీల్చితే గొంతు గరగరలాడటం, స్వరం మారటం జరుగవచ్చు పైగా దగ్గు ఏర్పడి గుక్కపట్టలేక రాగంలోని మలుపులలో కవి భావాలను తెలియజెప్ప లేక అపశృతిగా మారే అవకాశం వున్నది. ఎప్పుడో ఒకమారు కాల్చటంవల్ల ఏ హాని ఏర్పడదు. ★

## పునరావృతం

మళ్ళీ ఇన్నేళ్ళకి మరిది ఉత్తరం రాయడం చిత్రంగాక ఇంకేమిటి. సుందరం ఒక్కగానొక్క కొడుకు చదువు సంధ్యలు వంటబట్టక జులాయిగా తిరుగుతున్నాడని విన్నది. ఆ పిల్లవాడికేనన్నమాట ఉద్యోగం.

ఆ పొద్దంతా ఆలోచనలతోనే గడిపింది జానకి ఉత్తరం వాసుకి చూపడానికే భయం కలిగింది. ఏమంటాడో ! అసలే కోపిష్టి. పినతండ్రి అంటే వాడి మనసులో విపరీతమైన ద్వేషం పేరుకు పోయింది. తమ కష్టాలకు అతడే కారణమనే భావన వాడిలో స్థిరంగా పాతుకుపోయింది.

వాసు సాయంత్రం మామూలుగా పలకరించినా ఏదో తప్పు చేసినట్టు తడబడిపోయింది జానకి.

''వాసూ !.. నీతో ఓ సంగతి చెప్పాలిరా'' లని ఆగింది.

''సుందరం బాబాయి ఉత్తరం రాశాడు.''

వాసు ఎటువంటి ఉద్వేగం లేకుండా విన్నాడు. ఇది కొత్తదేం కాదు. అమ్మకి తెలియ కుండా రాయబారాలు చాలానే జరిగాయి. ఉన్నది ఒక్క క్లర్క్ పోస్టు. అయినా మినిస్టర్ల నుంచి కూడా రికమండేషన్లు ఉన్నాయి.

శేషుకు ఉద్యోగం ఇవ్వడం తన చేతిలోని పనే. అయితే ఈ విషయంలో తల్లి అభిప్రాయం ఏమిటో తెలుసుకుందామనే వేచి ఉన్నాడు.

''పాపం. సుందరం బాబాయికి లేకలేక ఒక్కడే పుట్టాడురా. వాడు ప్రయోజకుడు కావాలనీ, నాలుగు రాళ్ళు సంపాదించుకోవాలనీ తండ్రిగా బాబాయి ఆశించడంలో తప్పేం ఉంది ? వాడికి ఓ దారి చూపించే అవకాశం నీకొచ్చింది కాదనకు.'' ఇంకా ఏదో చెప్పాలని జానకి తాపత్రయ పడిపోతోంది

వాసుకి బాగానే అర్థమైంది. తల్లి ఇంకేం చెప్పాలి. ''అలాగేనమ్మా''.

అంతవరకు ఎటూ ఓ నిర్ణయానికి రాలేక ఊగిసలాడుతున్న అతని హృదయం నిర్వేదంగా నిట్టూర్చింది.

కళ్ళముందు తరతరాల త్యాగభావనతో రూపు దిద్దుకున్న భారతీయ సంస్కృతి, గాంధీజీ నీతి సూత్రాలు ప్రబోధించే మూడు కోతులూ నిలిచేయి దేశంలో సోషలిజం నినాదాలు, అహింసాతత్వం ఏ దమన నీతితో అణచివేయబడతాయో ఊహకు తోచింది. మరోపక్క ధనికవర్గంలో పెచ్చు పెరిగి పోతున్న స్వార్థం ప్రజ్వరిల్లుతున్న మారణహోమం దేనిలో ఊపిరి పీల్చుకోగలవో కూడా అర్థమైంది. ★